ప్రజాశక్తి

గురువారం 29 డిసెంబర్ 2022 | 5 | పార్వతీపురం మన్యం



గిరిజన గ్రామాల్లో కందికొత్తల సందడి

ప్రజాశక్తి-జియ్యమ్మవలస

ఏజెన్సీలో గిరిజన సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించే కందికొత్తల పండగ సందడి నెలకొంది. ఏటా కందికొత్తల పండగ నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పండగ నిర్వహించాకే గిరిజనులు పండించే పంటల వద్దకు వెళ్తుంటారు. కందికొత్తల పండగకు గిరిజనేతర గ్రామాలకు వెళ్లి ప్రచారం కూడా నిర్వహిస్తుంటారు. ప్రతి సంవత్సరం డిసెంబర్‌లో కందికొత్తల పండగ నిర్వహించుకుని, పంటలను ఇంటికి తెస్తామని గిరిజనులు చెబుతున్నారు.



గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తున్న గిరిజనులు



సచివాలయంలో వినతి అందించేందుకు వచ్చిన దనాన జానకమ్మ

పింఛను మొత్తం పెంచుతామని ప్రకటించిన కొద్ది రోజుల్లోనే నిబంధనల పేరిట పింఛనుదారులకు ప్రభుత్వం నోటీసులు జారీచేస్తోంది. ఆదాయపన్ను పరిధిలోకి వస్తున్నారని, వెయ్యి చదరపు అడుగులు ఇల్లు ఉందని, 300యూనిట్లకన్నా మించి విద్యుత్ వినియోగిస్తున్నారని, మూడెకరాలకు మించి భూమి ఉందని, కుటుంబంలో ఒకరు లేదా అంతకంటే ఎక్కువ మంది ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నారని ఆయా నోటీసుల్లో స్పష్టం చేసింది. అంతే కాదు సుమా...! తాత్కాలికంగా పింఛన్లను నిలిపివేస్తున్నట్లు స్పష్టం చేసింది. దీంతో, పింఛనుదారుల్లో ఆందోళన మొదలైంది. జనవరి నుంచి పింఛను పెరుగుతుందని ఆశపడితే, పింఛను తొలగింపు కోసం నోటీసులు ఇస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెయ్యి చదరపు అడుగుల ఇల్లు ఉంటే

పింఛను ఫట్

- ఆదాయ పన్ను కట్టినా, మూడెకరాల పొలం ఉన్నా గండమే
- 300 యూనిట్ల విద్యుత్తు ఉపయోగించినా అంతే సంగతులు
- పింఛనుదారులకు ప్రభుత్వం నోటీసులు
- అవ్వాతాత, విభిన్న ప్రతిభావంతులు, దీర్ఘకాలిక రోగుల గుండెల్లో గుబులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 15 కేటగిరిల్లో 2,75,756 మందికి ప్రస్తుతం పింఛన్లు అందుతున్నాయి. వీటిలో అత్యధికంగా 1,51,773 మంది వృద్ధులకు, 58,144మంది వితంతువులకు, 35,408 విభిన్న ప్రతిభావంతులకు పింఛన్లకు అందుతున్నాయి. అభయహస్తం పథకం కింద మరో 10,149మందికి అందుతున్నాయి. వీరితోపాటు కిడ్నీ, గుండె, తలసేమియా, క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక రోగులు, చేనేత, గీత కార్మికులు, ఒంటరి మహిళలు, హిజ్రా, మత్స్యకారులు, కళాకారులకు కూడా పింఛను పథకం అమలవుతోంది. వీరిలో వృద్ధులు, వితంతువులు, చేనేత కార్మికులకు, కల్లుగీత కార్మికులు, మత్స్యకారులు, ఒంటిరి మహిళలు చర్మకారులకు రూ.2,500 చొప్పున అందుతున్నాయి. దీర్ఘకాలిక రోగులకు రూ.3వేల నుంచి రూ.10వేల వరకు అందుతున్నాయి. వీరందరికీ కలిపి మొత్తం నెలకు రూ.69.38కోట్ల మేర విడుదలవుతోంది. జనవరి నుంచి రూ.250 చొప్పున పింఛను పెంచి రూ.2750 అందిస్తామని ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన విషయం విధితమే. దీంతో, పెరగనున్న పింఛనుతో ఎంతోకొంత ఆర్థిక ఇబ్బంది తీరుతుందని పింఛను దారులు ఆశించారు. కానీ, పెంపు అమలులోకి రాకముందే నోటీసులు ఇచ్చి, తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో వేలాదిమంది ఆందోళన చెందుతున్నారు. నిబంధనలు కొత్తకాకపోయినప్పటికీ పింఛను పెంచుతున్న సమయంలో ప్రక్షాలన పేరుతో నిలిపివేత నోటీసులు జారీచేయడంతో ప్రభుత్వం భారాన్ని తగ్గించుకోవడానికి చూస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. 2.31సెంట్లకు (వెయ్యి చదరపు అడుగులు) మించిన స్థలంలో ఇల్లు ఉంటే పేదరికంలో లేనట్టేనా? అని జనం ప్రశ్నిస్తున్నారు.

పై నిబంధనలను కారణాలుగా పేర్కొంటూ పార్వతీపురం మన్యం జిల్లాలో 2,500 మంది పింఛనుదారులకు సచివాలయాల ద్వారా నోటీసులు అందజేశారు. పార్వతీపురం పట్టణంలోనే 400 మందికి నోటీసులు జారీచేసినట్టు సమాచారం. విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 1542 మందికి నోటీసులిచ్చారు. నోటీసులు ఇచ్చినంత మాత్రాన పింఛన్లు నిలిపివేసినట్టుగా కాదని అధికారులు చెబుతున్నారు. విజయనగరం జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల మందికి నోటీసులు ఇచ్చినట్టు అధికారుల అంచనా. నోటీసులన్నీ సచివాలయాల స్థాయి నుంచే వెళ్లడం వల్ల ఈనెలాఖరు నాటికి స్పష్టంగా ఎంతమందికి నోటీసులు ఇచ్చామనే విషయం తెలుస్తుందని డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్ చక్రవర్తి ప్రజాశక్తికి తెలిపారు. వేపాడ మండలంలో 72 మందికి నోటీసులిచ్చినట్టు ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ స్పష్టం చేశారు. ఇందులో ఆతవలో 7, బల్లంకిలో 6, బానాదిలో 4, బొద్దాంలో 9, డిఆర్‌పేటలో 3, జాకేరులో 2, కెజిపూడిలో 4, కొంపల్లిలో 4, ఎన్‌కెఆర్‌పురంలో 6, నల్లబెల్లిలో 1, పాటూరులో 2, ఆర్‌ఎస్‌పేటలో ఒకటి, సింగరాయిలో 6, సోంపురంలో 3, వల్లంపూడిలో 3, వేపాడలో 6, వావిలపాడులో 3, వీలుపర్తిలో 2 మంది చొప్పున ఉన్నారు. 15రోజుల్లో అర్హతకు సంబంధించిన ఆధారాలను ధ్రువీకరణ పత్రాలతో చూపించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలో 400మందికి, రేగిడి మండలంలో 170 మందికి పింఛన్లు నిలిపివేస్తూ నోటీసులు ఇచ్చినట్టు సమాచారం.

తప్పడు సమాచారంతో పింఛను తొలగింపు!

పాచిపెంట : పాచిపెంట మండల కేంద్రంలోని పోతులవీధికి చెందిన దనాన జానకమ్మ అనే వృద్ధురాలికి ఆరేళ్లకు పైగా పింఛను అందుతోంది. కానీ ఆమె 300 యూనిట్ల విద్యుత్తు వినియోగించడంతో పింఛను తొలగిస్తున్నట్లు వాలంటీర్ ద్వారా నోటీసు అందింది. ఆమె మనుమడు వసంతరావుతో కలిసి సచివాలయానికి వెళ్లగా, జానకమ్మ ఆధార్ నంబరుతో 10 వరకు సర్వీస్ నంబర్లు ఉన్నట్లు తేలింది. తప్పుడు సమాచారంతో తన పింఛను ఎలా తొలగిస్తారని బాధితురాలు జానకమ్మ వాపోయారు. బుధవారం సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు ఆధ్వర్యాన జానకమ్మ సచివాలయ సిబ్బందికి వినతి అందించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు ఈశ్వరరావు మాట్లాడుతూ నిర్దిష్ట సమాచారం లేకుండా ఏదో వంకతో పింఛన్లు ఆపేస్తామని నోటీసులివ్వడం దారుణమన్నారు. సచివాలయ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల బాధితులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఏమైనా చిన్న చిన్న తప్పిదాలుంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించాలి తప్ప ప్రజలను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. వెంటనే అర్హులందరికీ పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కొడుకుల ఇంటిని నాకు ముడిపెట్టారు



నాకు నలుగురు కుమారులు. వారికి నేనంటూ పెద్దగా ఆస్తిపాస్తులు ఇవ్వలేక పోయినా, వారి కాయకష్టంతో వారంతా ఇళ్లు కట్టుకున్నారు. ఆ ఇళ్లన్నీ తనవిగా పేర్కొంటూ నోటీసులు ఇవ్వడం ఎంత వరకు సమంజసం. సొంత ఇల్లు ఉంటే పింఛను కట్ చేయడం ఏమాత్రం సరికాదు. అందులోనూ ఇంటి విస్తీర్ణంతో ముడిపెట్టడం మరింత మోసం.

-నిడదవ శివుడు, గొల్లపల్లి, బొబ్బిలి మున్సిపాలిటీ



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న చెరకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు

చక్కెర పరిశ్రమను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్ ● 2న కలెక్టరేట్ వద్ద ధర్నాకు పిలుపు

ప్రజాశక్తి-సీతానగరం

లచ్చయ్యపేట వద్దనున్న ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమను ప్రభుత్వమే స్వాధీనం చేసుకుని, నడపాలని వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం లచ్చయ్యపేటలోని చక్కెర పరిశ్రమ వద్దనున్న ఎస్టేట్‌లో ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా చెరకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కర్రి అప్పారావు మాట్లాడుతూ చక్కెర పరిశ్రమ దుస్థితికి యాజమాన్యంతో పాటు, గత చంద్రబాబు, నేటి జగన్ ప్రభుత్వాల బాధ్యతా రాహిత్యమే కారణమన్నారు. ప్రభుత్వాలు చేసిన నేరాలకు రైతులను, కార్మికులను, ఈ ప్రాంత ప్రజలను బలిచేయడం అన్యాయమన్నారు. లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేసి, ఖర్చు పెడుతున్న ప్రభుత్వానికి.. స్థిరమైన ఉపాధిని, ఆదాయాన్ని ఇచ్చిన ఫ్యాక్టరీపై పెట్టుబడి పెట్టడంపై ఆలోచన చేయకపోవడం దారుణమన్నారు.

ఎపి రైతుసంఘం విజయనగరం జిల్లా కార్యదర్శి బుద్దరాజు రాంబాబు మాట్లాడుతూ రోజూ తెల్లారితే తమది రైతు ప్రభుత్వమని ఊదరగొడుతున్న పాలకులు.. రైతుల సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శించారు. పాలకులకు నిజంగా రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే లచ్చయ్యపేట ఫ్యాక్టరీని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుని నడపాలని డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై జనవరి రెండో తేదిన పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టాలని సమావేశంలో తీర్మానించారు. ధర్నాను విజయవంతం చేయాలని రైతులను, కార్మికులను కోరారు.

ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, విజయనగరం జిల్లా అధ్యక్షులు ఎస్.గోపాలం, మన్యం జిల్లా నాయకులు గేదెల సత్యనారాయణ, బంటు దాసు, నాయకులు బి.లక్ష్మణ, రైతు కూలీ సంఘం నాయకులు వెలగాడ కృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి కార్యదర్శి రెడ్డి వేణు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శి రెడ్డి ఈశ్వరరావు, కొల్లి గంగునాయుడు, కౌలురైతు సంఘం జిల్లా నాయకులు రెడ్డి రమణమూర్తి, బి.అప్పారావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, విజయనగరం జిల్లా అధ్యక్షులు పి.శంకర్‌రావు, సిహెచ్ కృష్ణ, జి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గరపడ్డాయి : టిడిపి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

పింఛన్ల తొలగింపు అన్యాయమని, వైసిపి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొబ్బిలి చిరంజీవులు అన్నారు. బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జగనన్న ప్రభుత్వం పింఛన్ల ఏరివేత కానుకగా ఇచ్చినందుకు అవ్వ, తాతలు మండిపడుతున్నారని తెలిపారు. ఎన్నో ఏళ్ల నుంచి పింఛన్లు అందుకుంటున్న వారికి నోటీసులు ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సమావేశంలో నాయకులు ద్వారపురెడ్డి శ్రీదేవి, జి.రవికుమార్, తిరుపతిరావు, బి.రవికుమార్ , తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

సమన్వయంతో ప్రజల ముందుకు..

ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

ప్రజాశక్తి-గుమలక్ష్మీపురం

సచివాలయ కన్వీనర్లు వాలంటీర్లతో సమన్వయం చేసుకుని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి కోరారు. గుమ్మలక్ష్మీపురంలోని బిఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో బుధవారం సచివాలయ కన్వీనర్లతో నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని లక్ష్యంతో సచివాలయ వ్యవస్థను సిఎం జగన్ ఏర్పాటుచేశారని తెలిపారు. పదో తరగతి, ఇంటరు పాసైన వారికి కూడా ఉద్యోగ భరోసా కల్పించాలని ఉద్దేశంతో వాలంటీర్లుగా నియమించారని చెప్పారు. ఒకప్పుడు ప్రజలు తమ పనుల నిమిత్తం సుదూర ప్రాంతంలో ఉన్న మండల కేంద్రానికి రావాల్సి వచ్చేదని, దీంతో ఎన్నో వ్యయ ప్రయాసలు పడ్డారని అన్నారు. ప్రజా సంక్షేమం, మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రజలకు చేరువగా పంచాయతీ కేంద్రాల్లో సచివాలయాలను ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు తప్పాయని తెలిపారు. గుమ్మలక్ష్మీ పురం, కురుపాం మండలాల్లో గిరిజనులు సాగు చేస్తున్న 20 వేల ఎకరాలకు పోడు పట్టాలు అందించామన్నారు. సచివాలయ కన్వీనర్లకు లైఫ్ ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కడుతోందన్నారు. త్వరలో గృహ సారథులను కూడా నియమిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపిపి కె.దీనమయ్య, జెడ్‌పిటిసి ఎం.రాధిక, వైస్ ఎంపిపిలు నిమ్మక శేఖర్, లక్ష్మణరావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, వైసిపి నాయకులు నిమ్మక గోపాల్, అడ్డాకుల చిన్నారావు, గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట సర్పంచులు బొత్తాడ గౌరీ శంకర్‌రావు, ఆర్.చైతన్య స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

రవాణా ఛార్జీలు భరిస్తేనే లారీలు

- చేతులెత్తేసిన అధికారులు
- ట్రాక్టర్లపైనే ధాన్యం తరలింపు

ప్రజాశక్తి-సాలూరు

ధాన్యం రవాణా ఛార్జీలు భరించిన రైతులకే లారీలు సరఫరా చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కొద్దిరోజుల క్రితం వరకు డీజిల్ ఖర్చుల కింద ఒక్కో లారీకి ఐదువేల రూపాయలు చెల్లించింది. ఈ డబ్బులు ఖర్చయిపోవడంతో అధికారులు చేతులెత్తేశారు. లారీ డీజిల్ ఖర్చులకు ఐదువేల రూపాయల చొప్పున ఇద్దరు ముగ్గురు రైతులు కలిసి భరించుకుంటే అధికారులు లారీ పంపిస్తున్నారు. దానికి రైతులు ముందుకు రాకపోతే లారీలు పంపించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులు ట్రాక్టర్లలో ధాన్యం రవాణా చేసుకుంటున్నారు.



ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్న ధాన్యం బస్తాలు

లారీ యజమానులకు రవాణా ఛార్జీల కింద స్థానిక మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ద్వారా కొద్దిరోజుల వరకు ఐదువేల రూపాయల చొప్పున పంపిణీ చేశారు. ఆ నిధులు ఖర్చయిపోవడంతో రవాణా ఛార్జీలు రైతులే భరించాలని ఆంక్షలు విధించారు. మండలంలోని శివరాంపురం గ్రామంలో 326 ఎకరాల్లో వరి సాగైంది. ఇంతవరకు గ్రామం నుంచి 3628 క్వింటాళ్ల ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇంకా నాలుగు లారీల ధాన్యం గ్రామంలో అమ్మకానికి సిద్ధంగా ఉంది. కానీ లారీలు సరఫరా లేకపోవడంతో రైతులు ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. దీనివల్ల వారికి తడిసి మోపెడు ఖర్చులవుతున్నాయి. లారీలతో కన్నా ట్రాక్టర్ల ద్వారా అయితే రైతులకు ఎక్కువ ఖర్చవుతోంది. పెద్ద రైతులైతే రవాణా ఛార్జీలు భరిస్తూ లారీల్లో రవాణా చేసుకుంటున్నారు. చిన్న, సన్నకారు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వరి సాగు ఎక్కువగా ఉన్న కూర్మరాజుపేట గ్రామంలో చాలామంది రైతులు ప్రయివేటు వ్యాపారులకు ధాన్యం అమ్ముకున్నారు. ప్రభుత్వ కనీస మద్దతుధర కన్నా 200 నుంచి 300రూపాయలు తగ్గించి వ్యాపారులకు విక్రయించారు. అలా కొనుగోలు ధాన్యాన్ని వ్యాపారులు అదే రైతుల పేరిట ప్రభుత్వానికి అమ్ముతున్నారు.

మండలంలో మామిడిపల్లి, కొత్తవలస, కరాసువలస గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యాన్ని చాలా వరకు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించారు. పెద్ద రైతులకు సంబంధించిన ధాన్యం ముందు లారీల్లో రవాణా అయిపోయింది. మిగిలిన చిన్న, సన్నకారు రైతుల ధాన్యం కొనుగోలు చేసే సమయానికి లారీల సరఫరా నిలిచిపోవడంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఏమీచేయలేని నిస్సహాయ స్థితిలో చేతులెత్తేశారు. రవాణా ఛార్జీలు భరిస్తామంటే లారీలు పంపిస్తామని వారు స్పష్టం చేస్తున్నారు.

గురుకులంలో విద్యార్థినికి పాముకాటు

ప్రజాశక్తి- కురుపాం

స్థానిక శివన్నపేట వద్దనున్న గిరిజన బాలికల గురుకుల వసతిగృహంలో విద్యార్థినికి పాముకాటేసిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. కొమరాడ మండలం కొరిసల గ్రామానికి చెందిన ఊయక సోనియా శివన్నపేట గురుకులంలో ఆరో తరగతి చదువుతోంది. వసతిగృహంలో రాత్రి విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. సోనియా స్నాక్స్ తీసుకొస్తుండగా కాలిపై పాము కాటేసింది. వెంటనే అక్కడి వాచ్‌మెన్, సిబ్బంది గుర్తించి, కురుపాం సిహెచ్‌సికి తీసుకెళ్లారు. అక్కడ ప్రాథమిక చికిత్స చేసి, పార్వతీపురంలోని జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. బుధవారం సాయంత్రానికి కోలుకోవడంతో సోనియాను డిశ్చార్జి చేసినట్లు ప్రిన్సిపల్ సత్యవతి తెలిపారు.



జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్న సోనియా

ఎందుకంత ప్రేమ?

షాపు వేలంలో అత్యుత్సాహం

ప్రజాశక్తి-పాలకొండ

పాలకొండ నగర పంచాయతీలో షాపుల వేలంలో అవకతవకలు జరుగుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇటీవల పాతబస్టాండ్ ఆవరణలో నగర పంచాయతీకి సంబంధించి ఒక షాపు లీజు వ్యవహారంలో వివాదంగా మారి, అప్పటి కమిషనర్ ఎసిబికి పట్టుబడ్డ విషయం తెలిసిందే. అయితే కొత్తగా వచ్చిన కమిషనర్ కూడా ఈ షాపు విషయంలోనే ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఐదు షాపులు అక్కడ ఉండగా కేవలం ఒక్కషాపు కోసమే ఈ నెల 15న పత్రికా ప్రకటన ద్వారా వేలం పాటకు ఆహ్వానించారు. షాపు కాలపరిమితి నిర్ణయించకుండా, సాల్వెన్స్ రూ.30 వేలకే కుదించి, లీజుకు ఇవ్వడానికి ప్రయత్నిస్తుండడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో అధికారులు ఎందుకింత అత్యుత్సాహం చూపిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కౌన్సిల్‌లో తీర్మానం చేయకుండానే షాపులీజుకు అనుమతించడం పట్ల అనుమానాలు వస్తున్నాయి.



ఇదే పాతబస్టాండ్ వద్ద ఉన్న షాపు

నిబంధనల మేరకే వేలం

నిబంధనల మేరకే పాతబస్టాండ్ దగ్గర ఉన్న షాపునకు వేలం నిర్వహించాం. అక్కడ ఐదు షాపులు ఉన్నప్పటికీ నాలుగు షాపులు శిథిలావస్థలో ఉన్నాయి. దీంతో ఖాళీగా ఉన్న ఒక షాపునకు వేలం వేశాం. ముఖ్యంగా నగర పంచాయతీకి ఆదాయం తేవాలనే వేలం నిర్వహించాం.

- ఎస్.సర్వేశ్వరరావు, కమిషనర్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

జాయింట్ కలెక్టర్ ఆనంద్

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఇళ్ల నిర్మాణ పనుల వేగం పెంచాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ అధికారులను ఆదేశించారు. జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలు, రీ సర్వే, జగనన్న స్వచ్ఛ సంకల్పం, ప్రాధాన్యత భవన నిర్మాణాల పురోగతిపై మండల స్థాయి అధికారులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీ, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ, అర్బన్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని అన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు గ్రౌండింగ్ లో ఉన్నవి, పనులు మొదలు కావలసినవి, తుది దశ నిర్మాణంలో ఉన్నవి పూర్తిచేసి అప్పగించాలని ఆదేశించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కింద చెత్త నుండి సంపద కేంద్రాలు ఆయా దశలో ఉన్న నిర్మాణాలకు బిల్లులు వెంటనే చెల్లించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో వీరఘట్టం, పెదబోగిలి, మావుడి చెత్త నుండి సంపద కేంద్రాలను స్థానిక శిక్షణ కేంద్రాలుగా వినియోగించాలని చెప్పారు. ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రీ సర్వేలో నిర్లక్ష్యం చూపకుండా లక్ష్యాలను సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ పి.రఘురాం, జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర్, జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా సర్వే, భూ సర్వే అధికారి కె.రాజకుమార్, జిల్లా విద్యా శాఖ అధికారి ఎస్.డి.వి.రమణ, తదితరులు, పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జెసి ఆనంద్

నల్లబ్యాడ్జీలతో 108 సిబ్బంది నిరసన

కొమరాడ : అత్యవసర వైద్య సేవలందిస్తున్న 108 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల నాయకులు కె.సాంబమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కొమరాడలో నల్లబ్యాడ్జీలతో 108 సిబ్బందితో కలిసి నిరసన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాదయాత్రలో 108 సిబ్బందికి సిఎం జగన్ ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో 108 సిబ్బంది పకీరు నాయుడు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోయ, వాల్మీకులను ఎస్‌టిలో కలపొద్దు

6న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా : ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు

ప్రజాశక్తి-సాలూరు

రాష్ట్రంలో బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులస్తులను ఎస్‌టిలో కలపొద్దని కోరుతూ వచ్చే నెల 6న తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించనున్నట్లు ఎపి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు సీదరపు అప్పారావు, మండల అధ్యక్షుడు గెమ్మెల జానకిరావు చెప్పారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో వారు దీనికి సంబంధించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ నంబర్ 52ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం కొన్ని కులాలను గిరిజన జాబితాలో చేర్చాలనే ప్రయత్నంలో ఉందని చెప్పారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం కూడా గిరిజనుల హక్కులను, ప్రయోజనాలను దెబ్బ తీయాలనే ఆలోచన చేస్తోందన్నారు. ఈ నిర్ణయం ఏమాత్రమూ ఆమోదయోగ్యం కాదని చెప్పారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లవుతున్నా ఇంకా గిరిజనులు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల బతుకులతో ఆటలాడుతున్నాయని విమర్శించారు. జిఒ నంబర్ 52ని రద్దు చేయాలని కోరుతూ జనవరి 6న అన్ని మండల తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కమిటీ సభ్యులు కూనేటి చినబాబు, సూకురు గంగయ్య పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘం నాయకులు

కలెక్టర్‌కు సత్కారం



కలెక్టర్‌ను సత్కరిస్తున్న కుమ్మరి శాలివాహన కమిటీ చైర్మన్

ప్రజాశక్తి-కలెక్టరేట్

కుమ్మరి శాలివాహన కమిటీ చైర్మన్ మండేపూడి పురుషోత్తం, సభ్యులు బుధవారం కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. కుమ్మరి, శాలివాహన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించేందుకు కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉరిటి యాదవ్, ఉమ్మిడాలపు రాంబాబు, దేవవరపు వెంకటరమణ, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'పప్పుల చీటింగ్' పై కేసు నమోదు

ప్రజాశక్తి-గుర్ల

పప్పుల చీటీ బాధితులు ఫిర్యాదు మేరకు గుర్ల ఎస్ఐ జి. శిరీష నిర్వాహకులైన పతివాడ శ్రీలేఖపై కేసు నమోదు చేశారు. వేలాది మంది నుండి డబ్బులు వసూలు చేసి వారికి ఇవ్వాల్సిన సరుకులు ఇవ్వక పోవడంతో బాధితులు గుర్ల పోసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. గత రెండు రోజుల నుండి బాధితులు పోలీసు స్టేషన్ చుట్టూ తిరుగుతున్నారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పతివాడ శ్రీ లేఖ, మజ్జి అప్పల రాజుల పై బుధవారం కేసు నమోదు చేశారు. శ్రీలేఖను అదుపులోకి తీసుకోగా అప్పలరాజు గురించి గాలిస్తున్నారు.

బాధితులకు న్యాయం చేయాలి : సిఐటియు

నెల్లిమర్ల : పప్పుల చీటీ బాధితులకు న్యాయం చేయాలని సిఐటియు నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. పప్పుల చీటీ స్కామ్‌లో కోట్లాది రూపాయలు మోసానికి గురైన బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్కామ్‌కు పాల్పడి పరారైన ప్రధాన నిందితులు మజ్జి అప్పల రాజు, పతివాడ శ్రీలేఖను అరెస్టు చేసి వారి నుంచి వసూలు చేసిన నగదును రాబట్టి బాధితులకు వెంటనే చెల్లించాలన్నారు. సంక్రాంతి పండుగకు నిత్యావసర వస్తువుల ఒప్పందంతో కొనుక్కొనే అవసరం లేకుండా చీటీల ద్వారా ప్రతి నెల రూ.300 చెల్లించి సరుకులు వస్తాయన్న సమయంలో చేతులెత్తేసి డబ్బుతో పరారవ్వడం దారుణమన్నారు.

సాంకేతిక లోపంతో ఆగిపోయిన రైలు

ప్రజాశక్తి- బొబ్బిలి

నిజాముద్దీన్ నుంచి విశాఖ వెళ్తున్న సమత ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో దిబ్బగుడివలస కాపుల గేటు వద్ద నిలిచిపోయింది. బుధవారం రాత్రి సుమారు 20 నిమిషాలు గేటు వద్ద రైలు నిలిచిపోవడంతో వాహనాలు, ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. గేటుకు ఇరువైపులా వాహనాలు స్తంభించాయి. సాంకేతిక సిబ్బంది ఇంజిన్‌ను బాగు చేయడంతో ప్రయాణికులు, వాహనదారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

నిబంధన ప్రకారమే ధాన్యం తూకం

సబ్‌కలెక్టర్ నూర్ ఉల్ కమర్

ప్రజాశక్తి-పాలకొండ

నిబంధనల ప్రకారం ధాన్యం తూకం వేయాలని సబ్ కలెక్టర్ నూర్ ఉల్ కమర్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని సందర్శించి, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం తూకంలో ఎటువంటి తేడాలు లేకుండా చూడాలని ఆదేశించారు. తూకంలో ఏమైనా తేడాలుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎ.ఒ ఎన్ని వాణి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

షెడ్యూల్ ఏరియా చట్టాలపై అధికారులకు, సిబ్బందికి అవగాహన ఉండాలని పీసా, ఎల్‌టిఆర్ ఎస్ఎస్ఓ, పల్లా త్రినాథరావు సూచించారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందికి ఐటిడిఎలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసా, ఎల్‌టిఆర్, 1/70 రెగ్యులేషన్ యాక్ట్ తదితర చట్టాల గురించి ఆయన వివరించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో అమలు చేయాల్సిన భూ చట్టాలను గుర్చి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గౌతమి కుమారి, ఎపిఒ రోసిరెడ్డి, తహశీల్దార్ నరసింహమూర్తి, ఎటిడబ్ల్యుఒలు శ్రీనివాసరావు, మంగవేణి, కృష్ణవేణి, ఏడు మండలాల డిటిలు, తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేరుస్తాం

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పేదల సొంతింటి కల నెరవేరుస్తామని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం పట్టణంలో రీసైజింగ్‌లో ఇళ్ల స్థలాలు కోల్పోయిన మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డులకు చెందిన 155 మందికి వెంకంపేట, పెదబొండపల్లి లేఅవుట్‌లో డ్రా తీసి, స్థలాలు కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రభుత్వం కేటాయించిన స్థలంలో తప్పనిసరిగా ఇల్లు నిర్మించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ హేమలత, తహశీల్దార్ శివన్నారాయణ, హౌసింగ్ ఎఇ అనంతరావు పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

మండలంలో ఉన్న పెద్దరామ, దోనుబాయి, పుబ్బడ సచివాలయాలను బుధవారం ఎంపిడిఒ కె.గీతాంజలి సందర్శించారు. పింఛన్ల నోటీసులు గురించి అడిగి తెలుసుకున్నారు. పథకాల గురించి అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇళ్ల సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఉష, తదితరులు ఉన్నారు.

నాణ్యమైన భోజనం పెట్టాలి

ప్రజాశక్తి-వీరఘట్టం

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని సిఎంఒ కె.రాజారావు వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. బుధవారం మండలంలోని కిమ్మి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు సరైన భోజనం పెడితే ఆరోగ్యంతోపాటు చదువుపై కూడా శ్రద్ధ చూపుతారని తెలిపారు. పాఠశాలలో ద్రావపుపై ఆరా తీశారు. అనంతరం మరుగుదొడ్లు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.పారినాయుడు, ఎం.పైడిరాజు, కె.గౌరినాయుడు, బి.మురళీధర్ పాల్గొన్నారు.

లక్ష్మునాయుడు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-వీరఘట్టం

వీరఘట్టంలోని బార్నాలవీధికి చెందిన కెల్ల లక్ష్మునాయుడు కుమారుడు నవీన్ ఇటీవల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వి.కళావతి బుధవారం ఆ కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకుని ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పి.గౌరమ్మ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపిల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని శిల్పారామంలో బుధవారం ఆర్‌ఎంపిల ఆత్మీయ కలయిక ఘనంగా జరిగింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 400 మందికి పైగా ఆర్‌ఎంపీలు హాజరై ఆటపాటలతో అలరించారు. ముఖ్య అతిథులుగా లోక్‌సత్తా రాష్ట్ర అధ్యక్షులు భీశెట్టి బాబ్జీ, విశాఖపట్నం బృందా హాస్పిటల్ సర్జికల్ ఆంకాలజీ డాక్టర్ వంశీధర్ పుట్టేపు హాజరై 2023 క్యాలండర్ ఆవిష్కరించారు. గ్రామాలలో ఎక్కువగా నమ్మేది గ్రామీణ వైద్యులనేని, ప్రజలలో కన్సల్టెన్సీ వారిపై అవగాహన కలిగించాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రామీణ ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగం జోష్, జిల్లా అధ్యక్షులు గెద్ద చిరంజీవి, కార్యదర్శి కొళ్ల పైడిరాజు, ఉపాధ్యక్షులు ముత్యాలరావు, రామ్మూర్తి రాజు, సహాయ కార్యదర్శి రమణ నాయుడు, నాయకులు ఉమా శంకర్, దివాకర్, అంజన్ రాయ్, గుప్తా తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలిలో చిరుజల్లులు

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలిలో బుధవారం సాయంత్రం చిరుజల్లులతో వర్షం కురిసింది. వర్షానికి ధాన్యం రైతులు ఇబ్బందులు పడగా కూరగాయలు, మొక్కజొన్న, చెరకు పంటలకు వర్షం బాగా అనుకూలిస్తుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సంక్షేమం పేరుతో దోచుకుంటున్న ప్రభుత్వం

శృంగవరపుకోట : సంక్షేమ పేరు చెప్పి ప్రభుత్వం ప్రజలను దోచుకుంటుందని మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని భవానీ నగర్, అంబుదాసు పాలెం గ్రామాలలో ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు జి.ఎస్.నాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. పెరిగిన నిత్యవసర వస్తువుల ధరలు, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ పేరిట మోసాలను ప్రజలకు వివరించారు. రైతుల సమస్యలు నిర్లక్ష్యం చేసిన వైనాన్ని, మద్యం ధరలు పెంచి ప్రజలను పీడిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, క్లస్టర్ కోఆర్డినేటర్ ఇందుకూరు శ్రీనివాసరావు, బీసెట్టి అరుణ, టిడిపి సీనియర్ నాయకులు ఆదారి సూరిఅప్పారావు, తూర్పాటి ఆదినాయుడు, అల్లూరి నర్సింహరాజు, ఐటిడిపి రాష్ట్ర సెక్రెటరీ కిరణ్, ఐటిడిపి నియోజకవర్గ ఇంఛార్జి అనకాపల్లి చెల్లయ్య, వసంత సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

ఒకేషనల్ కళాశాల తనిఖీ

బొబ్బిలి : బొబ్బిలి పట్టణంలో ఉన్న ఇంటర్మీడియట్ ఒకేషనల్ కళాశాలలను జిల్లా రివెన్ కమిటీ సభ్యులు ఎం.కృష్ణ, ప్రసాద్, ప్రకాష్ బుధవారం తనిఖీ చేశారు. మహాత్మా గాంధీ, సాయిరాం, లక్ష్మీ, న్యూటన్ ఒకేషనల్ కళాశాలను తనిఖీ చేసి విద్యార్థుల యొక్క ఆన్ ది జాబ్ ట్రైనింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యంతో విద్యను అందించాలని కళాశాల యాజమాన్యాలను కమిటీ సభ్యులు కోరారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు

ఎమ్మెల్యే అలజంగి జోగారావు

ప్రజాశక్తి-సీతానగరం

ప్రభుత్వం విద్యావ్యవస్థలో సమూల మార్పులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అలజంగి జోగారావు తెలిపారు. మండలంలోని బూర్జ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఆయన ట్యాబులను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే ట్యాబ్‌లను పంపిణీ చేసిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వాకాడ నాగేశ్వరరావు, ఎంపిపి బలగ రమణమ్మ, జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, వైసిపి మండల అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, ఎంపిటిసిలు టి.సూరపు నాయుడు, టి.పార్వతమ్మ, సర్పంచులు గుజ్జల దాసు, జి.అన్నంనాయుడు, బి.శ్రీనివాసరావు, బి.తిరుపతిరావు, సీనియర్ నాయకులు పి.ఈశ్వర నారాయణ, ఆర్‌వి, రత్నకుమార్, వై.రాధాకృష్ణ, అచ్యుత, తదితరులు పాల్గొన్నారు.



సీతానగరం.. ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అలజంగి జోగారావు



సాలూరు.. ట్యాబ్‌లను పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ ఈశ్వరరావు

కొమరాడ : సమాజ అభివృద్ధితోపాటు విద్యా బోధన మెరుగుపడాలని వైస్ ఎంపిపి నంగిరెడ్డి శరత్ బాబు. అన్నారు. బుధవారం మండలంలోని రాజ్యలక్ష్మిపురం స్కూల్లో విద్యార్థులకు ట్యాబులు అందజేశారు. 12 పాఠశాలలకు 442 ట్యాబులు మంజూరైనట్లు ఆయన తెలిపారు. మొదటి విడతలో నాలుగు పాఠశాలకు 182 ట్యాబులు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటలక్ష్మి, తదితరులున్నారు.

కురుపాం : మండలంలో మొండెంఖల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్పంచ్ ఐ.గౌరీశంకర్ బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి. శ్రీనివాసరావు, ఎస్ఎంసి చైర్మన్ అనంతరావు, తదితరులు పాల్గొన్నారు.

సాలూరు : పట్టణంలోని బంగారమ్మపేట మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం వార్డు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ నల్ల వీరమణి ట్యాబ్‌లను పంపిణీ చేశారు. పాఠశాలలో 8వతరగతి చదువుతున్న 18 మంది విద్యార్థులకు వారు ట్యాబ్‌లను అందజేశారు. పాఠశాల హెచ్ఎం డాక్టర్ రంభ రజనీకాంత్, పేరెంట్స్ కమిటీ వైస్ చైర్మన్ మధు, సభ్యులు కొట్యాడ సీతం నాయుడు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : బందలుపి, తాళ్లబురిడి ఉన్నత, పెదమరికి ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, హెచ్ఎం లక్ష్మి, సర్పంచ్ హిమరక గంగ, మాజీ సర్పంచ్ రాగాల సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భామిని : కుల, మత, ధనిక, పేద బేధాలు లేకుండా మనల్ని ఉన్నతంగా నిలబెట్టేది విద్యేనని బాలేరు ఎంపిటిసి కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. బుధవారం బాలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్పంచ్ జామి ప్రభాకర్, ఎంపిటిసి కలిసి విద్యార్థులకు ట్యాబుల్ పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం రుచి చూశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జామి రమేష్, ఉపాధ్యాయులు నిమ్మల మోహన్‌రావు, ఎం.చలపతిరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్ : విద్యార్థులు సాంకేతిక జ్ఞానాన్ని పెంచుకోవాలని వైస్ ఎంపిపి కనపాక సూర్యప్రకాశరావు అన్నారు. బుధవారం మండలంలోని ఓనిలో ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. హెచ్ఎం బలగ నాగమణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



భామిని.. మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న ఎంపిటిసి చంద్రశేఖర్

రహదారి పనులు ప్రారంభం



రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో మూలిగూడ జంక్షన్ రోడ్డు నుండి గుమ్మడిగూడ వరకు రహదారి పనులను బుధవారం ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి ప్రారంభించారు. 3.8 కిలోమీటర్ల మేర చేపట్టే ఈ పనులకు పిఎంజెఎస్‌వై ఇన్సెంటివ్ గ్రాంట్ ద్వారా రూ.65 లక్షలు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో గిరిజన గ్రామాలకు రహదారి, తాగునీటి, విద్య, వైద్యం అందనంత ఎత్తులో ఉండేవని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి సుదీర్ఘ పాదయాత్రలో గిరిజన, బడుగు, బలహీన వర్గాల ప్రజల సమస్యలు తెలుసుకుని ప్రతి గ్రామానికీ సచివాలయం ఏర్పాటు చేసి, వాలంటీర్ల ద్వారా సేవలందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు నేరుగా ప్రజలకు అందేలా పరిపాలన సాగిస్తున్నారని చెప్పారు. ప్రతి గిరిజన గ్రామానికి రహదారి, విద్య, వైద్యం వంటి మౌలిక వసతులు కల్పించి గిరిజన పక్షపాతి అయ్యారన్నారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, సర్పంచ్ శెట్టి సురేష్, ఎంపిపి శెట్టి పద్మావతి, జిల్లా కోఆప్షన్ సభ్యులు షేక్ నిషార్, జెడ్‌పిటిసి జి.సుజాత, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి శెట్టి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు, వైసిపి సీనియర్ నాయకులు అంధవరపు కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కెవికెను సందర్శించిన ఎమ్మెల్యే

రస్తాకుంటుబాయి కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఎమ్మెల్యే పి.పుష్ప శ్రీవాణి సందర్శించారు. ఈ సందర్భంగా కెవికె శాస్త్రవేత్తలతో మాట్లాడుతూ గిరిజన రైతులకు కెవికె ద్వారా అందుతున్న సేవలు గుర్చి అడిగి తెలుసుకున్నారు. అనంతరం కెవికెలో ఫారం, డెమో యూనిట్లను పరిశీలించారు. గిరిజన రైతులకు మెరుగైన సేవలు అందించి దిక్సూచిలా ఉండాలని శాస్త్రవేత్తలకు సూచించారు.

రైతులకు రీసర్వే పాస్ పుస్తకాలు

జియ్యమ్మవలస : భూముల రీసర్వే పాస్ పుస్తకాలను బుధవారం చినమేరంగిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి రైతులకు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 1363 నూతన పాస్ పుస్తకాలను రైతులకు అందించారు. రీసర్వే వల్ల రైతులకు ఎంతో లాభదాయకమని ఎమ్మెల్యే అన్నారు.



గ్రామంలో ర్యాలీ చేపడుతున్న టిడిపి నాయకులు సంధ్యారాణి, కార్యకర్తలు

గిరిజనాన్ని విస్మరించిన ప్రభుత్వం

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి

ప్రజాశక్తి-పాచిపెంట

గిరిజనుల అభివృద్ధిని ప్రభుత్వం విస్మరించిందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి విమర్శించారు ప్రస్తుత జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గిరిజనులు అన్ని రకాలుగా నష్టపోతున్నారని, ఉపాధి అవకాశాలు లేక వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలో రాయిగుడ్డివలస, కేరంగి, తాడూరు పంచాయతీల్లోని పలు గిరిజన గ్రామాల్లో బుధవారం ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నందేడివలస వారపు సంతలో అన్నా క్యాంటీన్ ద్వారా గిరిజనులకు భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వచ్చాక ప్రజలపై అనేక భారాలు మోపిందన్నారు. కరెంటు, విద్యుత్తు, బస్సు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి ప్రజలపై కోలుకోలేని దెబ్బతీసిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసిపికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పాంచాలి సర్పంచ్ గూడెపు యుగంధర్, ముఖి సూర్యనారాయణ, చల్ల కనక, కె.సురేష్, పూసర్ల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నర్సరీ అభివృద్ధికి చర్యలు



నర్సరీని పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ విష్ణు చరణ్

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఎస్‌కె పాడు ఉద్యాన కేంద్రం, నర్సరీని అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్ తెలిపారు. బుధవారం మండలంలోని ఎస్‌కెపాడు ఉద్యాన కేంద్రం, నర్సరీని ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం 43.4 ఎకరాల మేరకు ఉద్యాన కేంద్రం ఉందని తెలిపారు. ఇందులో ఉద్యాన కేంద్రానికి కొంతమేరకు భూమిని కేటాయించి, మిగతా స్థలాన్ని పర్యాటకాభివృద్ధి కోసం ప్రణాళికలు వేస్తున్నామని చెప్పారు. ఉద్యాన కేంద్రంలో ఎక్కడ, ఏమి ఉండాలన్నది డ్రోన్ కెమెరాతో మొత్తం సర్వే చేయించి, అనంతరం రిసార్టులు, రోడ్లు, తాగునీటి వసతులు వంటివి కల్పిస్తామని వెల్లడించారు. ఇప్పుడు ఉన్న ఫల, వృక్ష సంపదను కూడా అభివృద్ధి పరుస్తామన్నారు. ఉద్యాన కేంద్రంలో అభివృద్ధి చేసేందుకు గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శాంతేశ్వరరావు, ఐటిడిఎ పిఎఒ జి.శ్రీనివాసరావు, పిహెచ్ఒ మణిభూషణ్ తదితరులతో చర్చించారు. సాధ్యమైనంత మేరకు తొందరగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జగదీశ్వరరావు, వాటర్ షెడ్ మేనేజ్‌మెంట్ పిఒ పోలినాయుడు, భద్రగిరి గిరిజన సంక్షేమ శాఖ డిఇ సింహాచలం, ఎపిఒ శివరామకృష్ణ, హెచ్ఎన్ టిసి సిబ్బంది కృష్ణ, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న తోయక జగదీశ్వరి, పిఆర్‌టియు నాయకులు

పిఆర్‌టియు క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

పిఆర్‌టియు నూతన క్యాలెండర్‌ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి బుధవారం ఆమె స్వగృహం వద్ద ఆవిష్కరించారు. అనంతరం పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు వి.తవిటినాయుడు, ఉపాధ్యక్షులు రామి నాయుడు, కార్యదర్శులు కె.విజయ్, శశిభూషన్‌రావు మాట్లాడుతూ జగదీశ్వరికి తమ యూనియన్ నుంచి సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. దీనిలో ఉపాధ్యాయులు మోహన్‌రావు, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

'గడపగడపకు..'లో ఎమ్మెల్యేలు పుష్పశ్రీవాణి, కళావతి

ప్రజాశక్తి-కొమరాడ

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రజలందరికీ సక్రమంగా అందాలని ఎమ్మెల్యే పి.పుష్పశ్రీవాణి అన్నారు. బుధవారం మండలంలోని కల్లికోట గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ గ్రామంలో గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. గ్రామాల్లో ఉన్న అనేక సమస్యలు ఉండడంతో అధికారులను పిలిచి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి శ్యామల, జెడ్‌పిటిసి సభ్యులు ద్వారపురెడ్డి లక్ష్మి, సర్పంచ్ దత్తి మురళీ, వైస్ ఎంపిపి నాగిరెడ్డి శరత్, ఎంపిడిఒ రమేష్, తహశీల్దార్ రాధాకృష్ణ, ఎపిఎం సతీష్, ఎఒ శంకరరావు, ఎంఇఒ నారాయణస్వామి, వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్ నాయుడు, నాయకులు మరడాన సింహాచలం నాయుడు, సూరప నాయుడు, మల్లిబాబు పాల్గొన్నారు.

వీరఘట్టం : పాదయాత్రలో సిఎం జగన్ ఇచ్చిన హామీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వి.కళావతి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని 3వ సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరాతీసి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పి.గౌరమ్మ, ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు, ఎంపిడిఒ ప్రభాకర్ రావు, ఎపిఎం సువిన్‌నాయుడు, ఎపిఒ సత్యంనాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కె.పాపారావు, వైసిపి పట్టణ అధ్యక్షులు డి.లలిత కుమారి, పిఎసిఎస్ డైరెక్టర్లు కె.ఆంజనేయులు, భోగి లతా మాణిక్య చంద్రశేఖర్, ఇఒ వి రామచంద్రరావు పాల్గొన్నారు.



వీరఘట్టం.. ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తున్న ఎమ్మెల్యే కళావతి



వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిసుతన్న డిఐఒ జగన్మోహనరావు

వ్యాక్సినేషన్ పరిశీలన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పట్టణంలో 27, 28 వార్డుల్లో బుధవారం నిర్వహించిన సార్వత్రిక టీకా కార్యక్రమాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సందర్శించారు. టీకా నిర్వహణ కార్డులను పరిశీలించి సంబంధిత ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. స్థానిక సచివాలయంలో కార్యదర్శి నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని, సచివాలయ సిబ్బందికి, వాలంటీర్లకు కోవిడ్‌కు సంబంధించి చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. అనంతరం 24వ వార్డులో అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించారు. పిల్లల పర్యవేక్షణ రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. 23వ వార్డులో అంగన్వాడీ కేంద్రంలో 15 నుండి 30వ వార్డు వరకు చెందిన అంగన్వాడీ సిబ్బందికి నిర్వహించిన సమావేశంలో డిఐఒ పాల్గొని, పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పుష్ప, అమ్మ రాజులు, జయగౌడ్, వైద్య సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మిల్లర్ల దోపిడీని అరికట్టాలని వినతి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

ధాన్యం కొనుగోలులో రైస్‌మిల్లర్ల దోపిడీని అరికట్టాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు బి.అప్పలనాయుడు ఆధ్వర్యాన కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ వెంకటరావుకు వినతి అందించారు. క్వింటా ధాన్యానికి ఐదు కేజీలు అదనంగా డిమాండ్ చేస్తున్నారని వివరించారు.

డ్రిల్ సరే.. వైద్యులెక్కడ?

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

కోవిడ్ నివారణ ముందస్తు జాగ్రత్తలో భాగంగా జిల్లాలోని ఆయా ఆసుపత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించడం సంతోషమే కానీ జిల్లా ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది లేకుండా కరోనాను ఎలా ఎదుర్కొంటారని జనసేన పార్టీ నాయకులు ప్రశ్నించారు. బుధవారం జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా నాయకులు చందక అనిల్ కుమార్, వంగల దాలి నాయుడు, రాజాన రాంబాబు విలేకరులతో మాట్లాడారు. పాలకులకు, అధికారులకు మన్యం జిల్లా ప్రజల ఆరోగ్యమంటే లెక్కలేదని ఆరోపించారు. కొన్ని నెలలుగా పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో కీలకమైన వైద్యాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకపోవడం శోచనీయమన్నారు. ఆర్‌టిపిసిఆర్ టెక్నీషియన్లు ఎక్కడున్నారని ప్రశ్నించారు. పిఎస్ఎ ఆక్సిజన్ ట్యాంక్ ప్రారంభించిన అధికారులకు, పాలకులకు సిబ్బంది లేరన్న విషయం తెలియదా? అని నిలదీశారు. కీలకమైన బ్లడ్ బ్యాంకుకు డాక్టర్ లేకపోవడం అన్యాయమన్నారు.

బిసి కాలనీలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి-వీరఘట్టం

మండల కేంద్రంలోని బిసి కాలనీలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి.ఉమామహేశ్వరి పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిహెచ్ఎన్ పార్వతి, హెల్త్ విజిటర్ ఒ.శాంతికుమారి, ఎఎన్ఎంలు రాజేశ్వరి, ఉష, టెక్నీషియన్ దినేష్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కల్వర్టులో జారిపడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని నీలంతాపురం గ్రామానికి చెందిన నిడగంటి గౌరు (35) మద్యం మత్తులో జోగమ్మపేట వద్ద రహదారిపైనుంచి కల్వర్టులో జారిపడి మృతిచెందాడు. గౌరు జేబులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా కుటుంబ సభ్యులకు ఎస్ఐ నీలకంఠం సమాచారం అందించారు. అనంతరం శవపంచనామా నిర్వహించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. గౌరుకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని చినబొండపల్లిలో రెండు రోజుల క్రితం గుర్తుతెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంతో స్థానికులు స్పందించి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. రెండు రోజులుగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఆ వ్యక్తి మరణించాడు. మృతునికి సంబంధించిన వ్యక్తులు ఎవరైనా ఉంటే రూరల్ పోలీస్ స్టేషన్లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

భార్య మందలించిందని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పార్వతీపురం రూరల్

మండలంలోని దోకిశీల గ్రామానికి చెందిన నందివాడ శ్రీను మద్యానికి బానిసగా మారాడు. ఈ క్రమంలో బుధవారం పూర్తిగా మద్యం తాగి వెంకటరాయుడుపేటలోని అత్తారింటికి వెళ్లగా, భార్య ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో మనస్తాపం చెందిన శ్రీను గడ్డి మందు తాగాడు. స్థానికులు స్పందించి 108 వాహనంలో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం శ్రీనుకు వైద్యులు చికిత్స అందిస్తున్నారు.